సంపద కేంద్రాలు శిథిలం

- అక్కడికి చెత్త రాదు
- ఎరువులు తయారు కావు
- పట్టించుకునే వారూ లేరు



శిథిలావస్థలో ఉన్న మంగళంపాడు చెత్త సంపద తయారీ కేంద్రం

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇప్పుడు అక్కడికి చెత్త తీసుకువచ్చే వారు లేరు. అక్కడ ఎరువులు తయారు చేయడం లేదు. వీటిని పట్టించుకునే అధికారులు, పాలకులూ కూడా లేరు. దీంతో ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో చెత్తా చెదారాన్ని సేకరించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చెత్త నుంచి సంపద తయారు చేసే ఉద్దేశంతో వీటిని గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులోనూ ముఖ్యంగా గ్రామ పంచాయతీలకు ప్రధాన వనరులుగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం ఉపయోగపడుతుందన్న లక్ష్యంతో ప్రతి గ్రామ పంచాయతీ కేంద్రంలో చెత్త సంపద కేంద్రాల షెడ్లను నిర్మించింది. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు నేడు దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

చాలా చోట్ల నిరుపయోగం

కూటమి ప్రభుత్వ ప్రభుత్వంలో నిర్వహణ లోపం, ఉన్నత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఇవి క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. సూళ్లూరుపేట మండలంలోని 19 పంచాయతీలు ఉన్నాయి. ఇలుపూరు, మంగళంపాడు, దామానెల్లూరు, కోటపోలూరు, గోపాల్‌రెడ్డిపాళెం, కొరిడి, దామరాయి, కడపత్ర, సామంతమల్లాం, సుగ్గపల్లి, వెలగలపొన్నూరు, మన్నేముత్తేరి, ఎస్.వీ కండ్రిగ 14 పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు నిర్మించారు. మంగళంపాడు గ్రామంలో ఉన్న సంపద కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. చెత్త సేకరణకు పంచాయతీల్లో సిబ్బంది లేక పోవడంతో చెత్తను సంపద కేంద్రాలకు తరలించే పరిస్థితి లేదు. దీంతో పాటు పల్లెల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. ఫలితంగా సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.





వృథాగా ఉన్న చెత్త వేసే నాడెప్ తొట్టెలు, ఇలుపూరులో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం

గ్రామాలపై సర్కారు చిన్నచూపు

కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదు. గ్రామాల్లో పరిశుభ్రంగా ఉండేందుకు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై మాత్రం దృష్టి సారించడం లేదని విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఆయా పంచాయతీల పరిధిలో అవసరమైన మేరకు గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసి సంపద కేంద్రాల నిర్వహణకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

చాలా కష్టంగా ఉంది

పంచాయతీల్లో ఆదాయం లేదు. 8 నెలలుగా రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాలేదు. ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేక పోతున్నాం. దీంతో గ్రామాలు శుభ్రంగా ఉంచేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. కనీసం బ్లీచింగ్ చల్లలేని పరిస్థితిలో ఉన్నాం. గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే నిల్వ ఉంటుంది. చెత్త సంపద కేంద్రాలకు తరలించడం లేదు.

– తేరే కష్ణయ్య, సర్పంచ్,
ఇలుపూరు, సూళ్లూరుపేట మండలం

జాతర కమిటీ సమావేశం నేడు

సాక్షి ఎఫెక్ట్..

వెంకటగిరి రూరల్: పట్టణంలో సెప్టెంబర్ 11, 12 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న శ్రీ పోలేరమ్మతల్లి జాతరకు సంబంధించి పేరుతో అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోపాటు గత ఏడాది వైఫల్యాలపై సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'భక్తులకు పోలేరమ్మ తల్లే దిక్కు' అన్న కథనానికి అధికారుల్లో కదలిక వచ్చింది. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకట శ్రీనివాసులరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పొలాలకు దారి చూపండి

నాయుడుపేట టౌన్ : పట్టణ పరిధిలోని ఎల్‌ఏ సాగరం చెరువు ఆయకట్టుకు 71వ జాతీయ రహదారి నిర్మాణం సందర్భంగా దారి లేకుండా చేస్తున్నారని రైతులు సోమవారం ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమంలో తహసీల్దార్ రాజేంద్రకు వినతి పత్రం అందించారు. జాతీయ రహదారి నిర్మాణం సందర్భంగా ఎల్‌ఏ సాగరం చెరువుకు సంబంధించిన పంట కాలువలు పూడ్చివేశారన్నారు. ఈ విషయమై ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రైతుల పంట పొలాలకు దారి వసతి కల్పించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో రైతు సంఘ నాయకులు అత్తికాయల నటరాజు, షేక్ సుల్తాన్, అట్ల కృష్ణారావు, గోవా మాధవయ్య, నరసింహ నాయుడు, మచ్చ భాస్కర్ ఉన్నారు.

క్లుప్తంగా

ఎరువుల దుకాణాలు తనిఖీ



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని పలు వ్యవసాయ ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ ఏడీఏ డాక్టర్ పి అనసూయ, సీఐ ఏవీ రమణ, విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ సోమవారం తనిఖీ చేపట్టారు. యూరియా నిల్వలపై దుకాణాల్లో ఆరా తీశారు. పట్టణంలోని పాతబస్టాండ్ సమీపం వద్ద ఉన్న మనగ్రోమోర్ షాపులో యూరియా నిల్వలు, లైసెన్సు, రికార్డులు నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుజాత, పోలీసు సిబ్బంది జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

ఓజిలి: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ అధికారి జైతున్‌బీ పేర్కొన్నారు. స్థానిక మండల కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు సోమవారం అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు వినియోగించకుండా సేంద్రియ ఎరువులను వినియోగించి కూరగాయలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. బెండ, మునగ, ఆకుకూరలు, దోస, మునగ వంటి ఉత్పత్తులను ప్రజలకు విక్రయించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజేష్, ధనుంజయ, సుమతి, నారాయణ పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన నూతన పాలకవర్గం

వెంకటగిరి రూరల్: వెంకటగిరి ఏఎంసీ పాలకవర్గం సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్షులుగా పునుగోటి విశ్వనాథం, వైస్ చైర్మన్‌గా కూను సూరితో పాటు 13మంది డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిల్లకూరు/చిట్టేడు: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ ముందుగా అవగాహన పెంచుకోవాలని స్విమ్స్ వైద్యులు సూచించారు. చిల్లకూరు పీహెచ్‌సీలో, చిట్టేడు సచివాలయంలో సోమవారం స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సు సేవలు అందించి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. స్విమ్స్ వైద్యులు హరిత, పద్మావతి, చిల్లకూరు వైద్యులు షాలోమ్ అరాఫత్, తేజస్విని , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కండలేరులో 32 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటి కి 32.360 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9,350 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,200, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పెంచలకోనలో మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాపూరు: మండలంలోని పెంచలకోన అటవీశాఖ అతిథి గృహం సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు సోమవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించి పెంచలకోనలోని అవుట్‌పోస్టుకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి సుమారు 45 ఏళ్ల వయసుంటుందని చెప్పారు. సమీపంలో గడ్డిమందు బాటిల్ ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. మృతుని ఆచూకీ తెలిస్తే రాపూరు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

చికెన్ ధరలు 26-8-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	108
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	200
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	220
లేయర్ చికెన్	:	200

మాజీ మంత్రి కాకాణితో సంజీవయ్య



కాకాణితో భేటీ అయిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేట టౌన్ : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గోవర్ధన్‌రెడ్డితో కిలివేటి సంజీవయ్య భేటీ అయ్యారు. సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన నిలిచి చేస్తున్న పోరాటాలను కాకాణితో సంజీవయ్య చర్చించారు.

కలప స్మగ్లర్లపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఈశ్వరవాక గ్రామస్తులు

చిట్టమూరు: మండల పరిధిలోని ఈశ్వరవాక చెరువు కట్టపై ఉన్న కలపను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్న అధికార పార్టీ నేతపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ సర్పంచ్ ఆములూరు బంగారమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం నిరసన తెలిపారు. చెరువు కట్టపై ఉన్న వేపచెట్లను టీడీపీ నేత నరికి తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పోలీసులు,, అధికారులు టీడీపీ నేతల దౌర్జన్యాన్ని అడ్డుకోకపోగా వారికి వంత పాడుతూ తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇదే విషయంపై గూడూరు సబ్ కలెక్టర్, తిరుపతి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. అనంతరం ఎంపీడీఓ మనోహర్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు.

పురిటి బిడ్డలకు దుస్తుల పంపిణీ



బాలింతలకు దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చిల్లకూరు : గూడూరు ఏరియా ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో బాలింతలు, పురిటి బిడ్డలకు అవసరమైన దుస్తులను పంపిణీ చేశారు. వేజైపీ లయన్స్ క్లబ్ ద్వారా క్లబ్ అధ్యక్షులు బండ్ల సుధాకర్, వాణి దంపతుల మనవరాలు వాంగ్మయి జన్మదినం సందర్భంగా సోమవారం ఈ దుస్తులు అందించారు. సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్‌వీరావు, పట్టణ అధ్యక్షులు శ్రీనివాసయాదవ్, గురునాథం, ఎస్ఎల్ఎన్ స్వామి సఊదీర్, రత్నయ్య, నరసయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎం మొండి వైఖరి విడనాడాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

గూడూరురూరల్: గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మొండి వైఖరిని విడనాడి కార్మికులకు అండగా నిలవాలని ఎన్‌ఎంయూ నాయకులు గూడూరు డిపో ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కండక్టర్ శ్రావణ్‌కుమార్‌ను చిన్నపాటి కారణంగా సస్పెండ్ చేయడం ఎంత వరకు సబబని అన్నారు. సస్పెండ్ చేసిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జోనల్ చీఫ్ అడ్వయిజర్ ఎస్‌కేఎం అహ్మద్, జీఎస్ వాసులు, కే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మురుగు నీటితో ఇబ్బంది పడుతున్నాం

చిల్లకూరు: గూడూరు రెండవ పట్టణంలోని శ్రామిక నగర్‌లో నివాసం ఉండే కుంటుంబాల వారు పై నుంచి వచ్చే మురుగు నీటితో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సీపీఎం నాయకులు సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన, గూడూరు ఎమ్మెల్యేపాశం సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ చేస్తున్న సమయంలో శ్రామిక్ నగర్ వాసులతో కలసి వచ్చిన సీపీఎం నాయకులు తమగోడు విన్నవించారు. కాలనీలోకి ఎగువ నుంచి వస్తున్న మురుగు నీరు బయటకు వెళ్లకుండా కొంత మంది అడ్డు గోడ నిర్మించడం వల్ల ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి శివయ్య, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగిపై కేసు

వెంకటగిరి (సైదాపురం): పాత వినియోగదారులు, బజాజ్ ఈఎంఐ కార్డుదారులే లక్ష్యంగా చేసుకుని బాధితులకు తెలియకుండా రుణాలు మంజూరు చేసిన ఫైనాన్స్ అధికారి యోగేంద్ర బాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో సుమారు ఏడుగురి పేర్ల పై, రూ.7లక్షల వరకు రుణాలు తీసుకున్నట్లు ఫిర్యా దులు అందాయన్నారు.ఈ మేరకు బాధితుల ఫిర్యా దు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా వంతెన



బ్రిడ్జిపై కూలిన రక్షణగోడ

కోట: మండలంలోని కర్లపూడి వద్ద స్వర్ణముఖి చల్లకాలువపై ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జికి రెండు వైపులా రక్షణగోడలు దెబ్బతిని కూలిపోయాయి. పది గ్రామాలకు ఈ బ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. దీంతో వాహనదారులు భయపడుతున్నారు. వాహనాలు వెళ్లేటపుడు ఆదమరిస్తే చల్లకాలువ నీటిలో పడిపోయే ప్రమాదం ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జిపై రక్షణగోడ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చవితి వేడుకలకు సన్నద్ధం





చిల్లకూరు: విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు, సరికొత్తగా రూపుదిద్దుకున్న గణపయ్య

చిల్లకూరు/రాపూరు: వాడవాడలా చవితి వేడుకలకు భక్తులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే మండపాలు ఏర్పాటయ్యాయి. మండపాల్లో కొలువుదీరేందుకు గణపయ్య విగ్రహాలు రూపుదిద్దుకున్నాయి. చవితి కమిటీలు అధికారులు నిబంధనల మేరకు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే వినాయక విగ్రహాలు కొన్ని మండపాలకు చేరుకున్నాయి. మరి కొన్ని చివరి దశలో రూపుదిద్దుకుంటున్నాయి. ఈ రోజు సాయంత్రానికి గణేశుడి ప్రతిమలు మండపాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చవితి పూజలందుకున్న వినాయకుడు 3, 5, 7, 9, 11 రోజుల తరువాత నిమజ్జనానికి బయల్దేరుతారు. వాకాడు, కోట మండలాల్లోని తూపిలి పాళెం, శ్రీనివాససత్రం, చిల్లకూరు మండలంలోని తీగపాళెం బీచ్‌లలో నిమజ్జనం చేసేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకునేందుకు పోలీసులు అన్ని మతాల వారితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

రాపూరు: మండలంలోని గ్రామాల్లోని కూడళ్లలో గణపయ్యను కొలువు దీర్చేందుకు ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేక ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. విభిన్న ఆకృతుల్లో గణనాథుని ప్రతిమల ఏర్పాట్లుకు ఆసక్తి కనబరుస్తున్నారు.





రాపూరు: శివాలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ, సిద్ధలయ్య సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

పల్లె సీమలు.. మురికి కూపాలు

యాలకారికండ్రిగలో మురుగునీట గుంట, దిరసనమాలలో వీధి వెంబడి ఉన్న పేడదిబ్బ





పెళ్లకూరు: మండలంలోని పలు గ్రామాలు మురికికూపాలుగా మారాయి. ఎక్కడ చూసినా పేడదిబ్బలు, మురుగు నిల్వలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా భరించలేదని దుర్వాసన, దోమల వ్యాప్తి ఎక్కువై ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. మండల పరిధిలోని అర్థమాల, చవటకండ్రిగ, జీలపాటూరు, చిల్లకూరు, పాలచ్చూరు, చెంబేడు, పునబాక, రోసనూరు, కానూరు, పుల్లూరు, దిరసనమాల తదితర గ్రామాల్లో మురుగు పేరుకుపోతోంది. ప్రభుత్వం 15వ ఆర్థిక ప్రణాళిక సంఘం నిధులు ఒక్కో పంచాయతీకి రూ. 3 నుంచి రూ.6లక్షలు వరకు మంజూరు చేసినా ఫలితం మాత్రం శూన్యం. కనీసం ఏడాదికోసారి కూడా ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు శుభ్రం చేయకపోవడం గమనార్హం.





జీలపాటూరు గ్రామంలో పేడదిబ్బ, పునబాక దళిత కాలనీ వద్ద ఉన్న మురుగునీటి గుంట

జాతరలో కౌన్సిలర్లను భాగస్వాములుగా చేయాలి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న శ్రీపోలేరమ్మతల్లి జాతరలో వెంకటగిరి మున్సిపల్ కౌన్సిలర్లను భాగస్వాములుగా చేయాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరిశంకరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన అధికారులను కలిసి విన్నవించారు. పట్టణంలోని సుదర్శన్‌గర్‌లోని సచివాలయంలో సోమవారం ప్రజలు నుంచి స్థానిక సమస్యలపై అర్జీలను స్వీకరించారు.

పైపులైన్ లీకేజీతో తారు రోడ్డుపై గుంతలు



తారు రోడ్డుపై ఏర్పడిన గుంత

చిట్టమూరు: నాయుడుపేట-మల్లాం రహదారి తాగేటమ్మ ఆలయం వద్ద తాగునీటి పైపు లీకేజీ కావడంతో రోడ్డు గుంతలు పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాకాడు గ్రామ స్వర్ణముఖి నది ఒడ్డు నుంచి రాజీవ్ టెక్నాలజీ పథకంతో పైపులైను ద్వారా తీర ప్రాంత గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. రొయ్యల వాగు బ్రిడ్జి వద్ద 15 అడుగుల లోతులో ఉన్న పైపు పగిలి గత మూడు నెలలుగా నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. అయినా అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని మల్లమ్మగుడి ప్రాంతంలో ఉన్న గిరిజన కాలనీలో న్యాయవాద సంఘం ఉపాధ్యక్షుడు అద్దంకి గాంధీ, రెంటాల వాసు ఆధ్వర్యంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి విష్ణువర్మ ఆదేశాల మేరకు గిరిజన ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బాల్యవివాహాలు నిర్మూలించాలన్నారు. గిరిజనలకు ఎన్నో ప్రత్యేక రిజర్వేషన్లు, చట్టాలు అమల్లో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ అధికారి సునీత తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుల పంపిణీ



గూడూరు: స్మార్ట్ కార్డులు అందిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన, ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిల్లకూరు: కొత్త స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తున్నట్లు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన తెలిపారు. ఆయన సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో గూడూరు, చిల్లకూరు మండలాల ప్రజలకు స్మార్ట్ కార్డులను స్థానిక ఎమ్మెల్యేతో కలిసి పంపిణీ చేశారు.

దక్కిలి: మండలంలో తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు పలువురు లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

ఓజిలి: మండలంలో మొత్తం 32 రేషన్ దుకాణాలకు గాను 11,497 కార్డులు మంజూరైనట్లు తహసీల్దార్ పద్మావతి తెలిపారు.

చిట్టమూరు: మండలంలోని కొత్తగుంట రేషన్ షాపు వద్ద సోమవారం తహసీల్దార్ కాయల సతీష్‌కుమార్ స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు.

దొరవారిసత్రం : మండలం పరిధిలో 11,564 మందికి రేషన్ కార్డులు మంజూరు చేశారు. స్థానిక తహసీల్దార్ శైలకుమారి ఏకొల్లు, పోలిరెడ్డిపాళెం, తల్లంపాడు, నెలబల్లి సచివాలయాల్లో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.

సైదాపురం: బాలాయపల్లిలో తహసీల్దార్ విజయలక్ష్మి లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

పెళ్లకూరు: మండలంలో 10,687మందికి స్మార్ట్ రేషన్ కార్డులు వేగవంతంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ హరికృష్ణ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు.

సూళ్లూరుపేట : పట్టణంలోని కోళ్లమిట్ట ప్రాంతంలో కార్డులను ఆర్డీవో కిరణ్మయితో కలిసి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ లబ్ధిదారులకు అందజేశారు.